https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 77 గురువారం 23-07-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## ఒక్కో నౌకకు.. ఒక్కో విద్యుత్ ప్లాంట్

**హోర్ముజ్‌లో నౌకలపై దాడి చేస్తే**

**ఇరాన్ భారీగా మూల్యం చెల్లించుకోక తప్పదు..**

**వంతెనలు, రైల్వేస్టేషన్లను ధ్వంసం చేస్తాం: ట్రంప్**

**వాషింగ్టన్, జూలై 22:** హోర్ముజ్ జలసంధిలో ఒక్కో నౌకపై ఇరాన్ దాడి చేసిన ప్రతిసారీ.. ఇరాన్‌లో ఒక్కో విద్యుత్ ప్లాంటును, వంతెనలను, వాటికి సమీపంలో ఉన్నవాటిని ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ భారీగా మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఇరాన్‌పై యుద్ధంపట్ల అమెరికా ప్రజల్లో మద్దతు తగ్గుతోందన్న వార్తలను ట్రంప్ తప్పుబట్టారు. మరోవైపు, ఇక ఈ నెల 17న జోర్డాన్‌లోని మువాఫక్ సల్టీ ఎయిర్‌బ్లసపై ఇరాన్ చేసిన దాడికి సంబంధించి మరో అమెరికా సైనికుడు కూడా మృతిచెందినట్టు అమెరికా రక్షణశాఖ తాజాగా వెల్లడించింది. ఆ దాడిలో ఇప్పటికే ఇద్దరు సైనికులు మరణించారు. ఇరాన్‌పై తమ యుద్ధం ఖర్చు రూ.3,62 లక్షల కోట్లకు చేరినట్టు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తాజాగా వెల్లడించారు. గల్ఫ్‌లో బలగాల నిర్వహణ, యుద్ధం కోసం మరో రూ.8.45 లక్షల కోట్లు అవసరమని.. ఈ మేరకు నిధులను అనుమతించాలని అమెరికా చట్టసభ కాంగట?ప్రను కోరారు. అమెరికా, ఇరాన్ మధ్య బుధవారం కూడా పరస్పర దాడులు ఉధృతంగా కొనసాగాయి. అమెరికా దాడులకు ప్రతీకారంగా బుధవారం గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఉధృతంగా దాడులు చేసినట్టు ఇరాన్



రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. జోర్డాన్‌లోని మువాఫక్ సల్టీ ఎయిర్‌బేస్, ప్రిన్స్ హాసన్, కింగ్ ఫైసల్ స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసినట్టు తెలిపింది. ఈ దాడిలో పలు ఎఫ్-15 ఫైటర్లు, రెండు హెలికాప్టర్లు, ఎనిమిది ఎంక్యూ-9 డ్రోన్లు ధ్వంసమయ్యాయని.. మరికొన్ని తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొంది. ఇదిలా ఉండగా, ఎర్ర సముద్రం నుంచి అరేబియా సముద్రంలోకి ప్రవేశించే 'బాబ్ అల్ మందేబ్' జలసంధిలో హౌతీలు ఆంక్షలు పెట్టడంతో చమురు రవాణాపై మరింత ప్రభావం పడింది. చమురు ధర మళ్లీ

మిగతా 2లో...

## పదేళ్లలో 152 పరీక్షల పేపర్లు లీక్

**నెలకు ఒకటి లీక్.. శిక్షలు మాత్రం సున్నా**

**7.50 కోట్ల మంది విద్యార్థులపై తీవ్ర ప్రభావం**

**మోదీ హయాంలో అవినీతిమయమైన విద్యా వ్యవస్థ**

**ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం నా బాధ్యత**

**ప్రజల కోసం ఎన్ని దెబ్బలైనా తినడానికి నేను సిద్ధం**

**ధర్మేంద్ర ప్రధాన్ అవినీతిపరుడు, అసమర్థుడు**

**దేశ యువతకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి**

**మీడియాతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**

**ఇంత అప్రజాస్వామికమా?: ప్రియాంక**

**నీట్ విద్యార్థులపై పోలీసు చర్యను ఖండిస్తూ**

**నల్లదుస్తుల్లో పార్లమెంట్ వద్ద విపక్ష ఎంపీల నిరసన**



**న్యూఢిల్లీ, జూలై 22:** దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, గత పదేళ్లలో ఏకంగా 152 పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా బాధ్యులైన వారికి పడిన శిక్షలు మాత్రం 'సున్నా' అని మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలోని ఇందిరా గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసుల లాఠీ దెబ్బలకు గాయపడిన విద్యార్థుల ఆక్రందనల దృశ్యాలను మీడియాకు ప్రదర్శించారు. ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత విద్యా వ్యవస్థ.. మోదీ ప్రభుత్వ హయాంలో అక్రమాలు, లీకేజీలకు నిలయంగా మారిందని మండిపడ్డారు. దేశంలో పేపర్ లీకేజీలు ఒక పెద్ద మాఫియాగా మారాయని, దీని వెనుక ఉన్న బడాబాబులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని రాహుల్ దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం కంటితుడుపు చర్యలకు స్వస్తి చెప్పి, పటిష్ఠ చట్టాలు తీసుకురావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'గత దశాబ్ద కాలంలో దేశంలో ఏకంగా 152 పోటీ పరీక్షల

మిగతా 2లో...

## నేడు భారీ వర్షాలు

**హైదరాబాద్, జూలై 22:** తెలంగాణ రాష్ట్రంలో గురువా రం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిం చింది. అయిదు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచి ర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే ఈ నెల 28 వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, 24 జిల్లాల్లో లోటువర్షపాతమే నమోదైనట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా నందిగాంలో అత్యధికంగా 5.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



## ఇందరిమ్మ ఇళ్ల దరఖాస్తుకు ఆధార్ ఉంటే చాలు

**హౌసింగ్ శాఖ కమిషనర్ వి.పి.గౌతమ్**



**హైదరాబాద్, జూలై 22** క్యూర్ పరిధిలో పదేళ్ల నుంచి నివాసం ఉంటున్నవారు ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్ల పథకానికి అర్హులని హౌసింగ్ శాఖ కమిషనర్ వి.పి.గౌతమ్ తెలిపారు. దీనికి దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్, ఫోన్ నంబర్‌తోపాటు కుటుంబంలోని ఇతర సభ్యుల ఆధార్ నంబర్లు ఉంటే చాలని.. పెళ్లి కానివారు 'అన్‌మ్యారీడ్' ఆప్షన్ ఎంచుకుని, వారి తల్లిదండ్రుల ఆధార్‌లు ఇస్తే సరిపోతుందని ఆయన స్పష్టం చేశారు. కులధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల్లాంటివి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఇళ్లకు సంబంధించిన సందేహాలు, ఇతర అంశాలపై ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. అందులో ముఖ్యాంశాలు.. ఎల్ఐజీ ఇళ్ల పథకం గురించి తెలుసుకునేందుకు మేము ఏర్పాటుచేసిన కాల్‌సెంటర్‌కు చాలామంది ఫోన్‌లు చేస్తున్నారు.

## తోడ్పాటునివ్వండి!

**కీలక బిల్లులు గట్టెక్కాలి**

**'నీట్' ఆందోళనలు సమసిపోతాయి**

**మహిళా కోటా, డీలిమిటేషన్ ముఖ్యం**

**రాజ్యసభలో బలానికి ఢోకా లేదు**

**లోక్‌సభలో మరింత మద్దతు కావాలి**

**పలు పార్టీలతో చర్చలు జరుపుతున్నాం**

**చంద్రబాబుతో భేటీలో ప్రధాని వెల్లడి!**

**ఆగస్టు 10లోగా రాజ్యాంగ సవరణకు ఆమోదం!**

**'భోగాపురం' ప్రారంభానికి మోదీకి ఆహ్వానం**

**న్యూఢిల్లీ, జూలై 22** నీట్ పేపర్ లీక్ వివాదం... 'కాక్రోచ్' ఆందోళనలు... పార్లమెంటులో, బయటా విపక్షాల నిరసనల వేడి.... ఇవన్నీ ఎలా ఉన్నా సరే! ఈ పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కీలక బిల్లులకు ఆమోదం పొందాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృత నిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల పునర్ విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులు గట్టెక్కేలా వ్యూహ

మిగతా 2లో...



## రాహుల్ విదేశీ ఏజెంట్

**రాంచందర్‌రావు**

**దేశ వ్యాప్తంగా కాంగ్రెస్-బీజేపీ పోటాపోటీ నిరసనలు**

**రాహుల్ తీరును దుయ్యబట్టిన బీజేపీ అధ్యక్షుడు నబీన్**



**హైదరాబాద్, జూలై 22:** రాహుల్ గాంధీ ఇతర దేశాల నుంచి వస్తున్న కోట్లాది రూపాయల కోసం విదేశీ ఏజెంట్‌లా మారి బంగ్లాదేశ్, నేపాల్ తరహాలో యువతను రెచ్చగొట్టే కుట్రలకు పాల్పడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు ఆరోపించారు. నీట్ అంశంపై ఢిల్లీలో నిరసనకు దిగిన వారిలో నీట్ విద్యార్థులే లేరని, అసాంఘీక, అల్ట?ట్ర లెఫ్ట్ మూకలతో ఆందోళనలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ బుధవారం చేపట్టిన 'గాం?ధీ భవన్ ముట్టడి' కార్యక్రమంలో భాగంగా రాంచందర్‌రావు నాయకత్వంలో పార్టీ శ్రేణులు గాంధీభవన్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. రాంచందర్‌రావు సహా పలువురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. గతంలో రైతు ఉద్యమం ముసుగులో, షాహీన్ బాగ్ ఆందోళనలో ఏవిధంగా దేశవ్యతిరేక శక్తులు హైజాక్ చేశాయో, నేడు 'సీజేపీ' పేరుతో జరుగుతున్న ధర్నా కూడా అదే తరహాలో సాగుతోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ దేశవ్యతిరేక, విచ్ఛిన్నకర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు పార్లమెంటు సమావేశాలను బహిష్కరించి వీధి నాటకాలకు తెరలేపారని విమర్శించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై సభలో చర్చకు సిద్ధమని కేంద్రం చెప్పినప్పటికీ రాహుల్ గాంధీ ప్రధాని

మిగతా 2లో...

## అర్ధరాత్రి కలకలం..



**కరీంనగర్ క్రైం, జూలై 22** కరీంనగర్‌లో మరో భారీ దోపిడి జరిగింది. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో భగత్‌నగర్ చౌరస్తాలోని అజ్మత్‌అలీ ఇంటిలో దోపిడి దొంగలు చొరబడ్డారు. ఇంటి యజమాని అజ్మత్‌తో పాటు కుటుంబ సభ్యులను తాళ్లతో బంధించిన దుండగులు వెంటతెచ్చుకున్న తుపాకులు, కత్తులతో బెదిరించి, కొట్టి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుని పారిపోయారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే... భగత్‌నగర్ చౌరస్తాలో అజ్మత్‌అలీకి 10 వరకు షటర్లు ఉండగా పై అంతస్థులో ఒక పోర్షన్‌లో ఆయన నివసిస్తున్నారు. మిగతా ఆరు పోర్షన్లు అద్దెకు ఇస్తుంటాడు. అజ్మత్ అలీ, అతని భార్య, ఇద్దరు కూతుళ్లు ఇంటిలో ఉంటున్నారు. చౌరస్తాకు అతి సమీపంలో ఇల్లు ఉండడంతో అర్ధరాత్రి వరకు వాహనాల రాకపోకలతో అలికిడిగా ఉంటుంది. పడుకునే ముందు రాత్రి 12 గంటల సమయంలో ప్రతి రోజు ఇంటి ముందు లైట్లను ఆర్పివేసేందుకు ఇంటి యజమాని అజ్మత్ అలీ వెళుతుంటాడు. ఎప్పటి మాదిరిగానే అజ్మత్ అలీ మంగళవారం రాత్రి 12 గంటలకు మొదటి అంతస్థు నుంచి కిందకు దిగారు. అప్పటికే మెట్ల వద్ద నక్కి ఉన్న ఎనిమిది మంది దుండగులు అతడిని పట్టుకుని తాళ్లతో బంధించి పైపోర్షన్‌కు తీసుకువెళ్లారు. అజ్మత్ భార్య మహమూదాబేగం, కూతుళ్లు సాజిదాభాను, అఫ్రిన్‌ను తాళ్లతో బంధించి, అరవకుండా నోటికి గుడ్డ చుట్టారు.

మిగతా 2లో...

## గాంధీ, గాడ్సే వారసుల మధ్య పోరు

**ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి**

**లేదంటే తెలంగాణ నుంచే 'సడక్ సే సంసద్' పోరాటం**

**రాహుల్, ప్రియాంకపై దాడి చేయించిన కేంద్రం**

**కొడంగల్‌లో కాంగ్రెస్ నిరసనలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు**

**నాపై ఆ 'రెండు పార్టీలు' కుట్రలు చేస్తున్నాయి**

**కొడంగల్‌లో ఓట్లు తొలగించి దొంగదెబ్బ తీసే ప్రయత్నం**

**బీఎల్‌ఏలతో సమీక్షలో సీఎం.. సర్ ఫారం బీఎల్‌వోకు అందజేత**



**వికారాబాద్, జూలై 22** నీట్ ప్రశ్నపత్రాలను లీక్ చేసి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేంద్ర క్యాబినెట్ నుంచి ఆయనను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే 'సడక్ సే సంసద్' వరకు పోరాటాన్ని తెలంగాణ నుంచే ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిసే హక్కును అణచివేసే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో పాశవిక దాడి చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పోరాటం కాంగ్రెస్, బీజేపీ మధ్య కాదని, గాంధీ వారసులకు, గాడ్సే వారసులకు మధ్య జరుగుతున్న పోరాటమని అన్నారు. రాహుల్, ప్రియాంకపై పోలీసుల దాడి, అరెస్టును నిరసిస్తూ బుధవారం కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ర్యాలీ, ధర్నాలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నీట్ ప్రశ్నపత్రాలను కోట్ల రూపాయలకు విక్రయించి విద్యార్థుల జీవితాలను చీకటిమయం చేశారని ఆరోపించారు. ఇదుకు ధ ర్మేంద్ర ప్రధాన్‌ను, నిందితులను జైల్లో పెట్టాల్సిందిపోయి.. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై, యువతపై పోలీసులు ప్రతాపం చూపించారని మండిపడ్డారు. ఆందోళన చేస్తున్న ఆడపిల్లల దుస్తులు చింపేసి.. వారిపై దాడి చేశారని, విద్యార్థుల తలలు పగులగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడం లేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియడం లేదని అన్నారు.

మిగతా 2లో...

# అర్ధరాత్రి కలకలం.. (మొదటిపేజీ తరువాయి)

నిందితులు తీసుకువెళ్లిన ఒక సెల్ ఫోన్‌ను భగత్ నగర్ ప్రాంతంలో పోలీసులు రికవరీ చేశారు. ఒక డమ్మీ తుపాకిని సంఘటనా స్థలంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముఖాలకు ముసుగులు చేతులకు గ్లౌజులు ధరించి ఈ దాడికి దోపిడికి పాల్పడ్డారు.

**అల్లుడిపైనే అనుమానాలు**

అజ్మత్ అలీ కుటుంబానికి తెలిసిన వారే ఈ దోపిడికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. అజ్మత్‌అలీ కుమార్తె సాజిదాభానుకు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన రజావుద్దీన్‌తో వివాహం జరిగింది. వీరిద్దరి మధ్య గొడవలు జరగడంతో సాజిదా?భాను కరీంనగర్‌కు వచ్చారు. ఆ తర్వాత కుటుంబసభ్యులు నచ్చజెప్పడంతో రజావుద్దీన్, సాజిదాభాను కరీంనగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివసించారు. మళ్లీ వారిద్దరి మధ్య గొడవలు జరిగాయి. జూన్ 17న రజావుద్దీన్ తన ఫ్లాట్‌లోని సామగ్రి, టీవీ, కారును తీసుకుని పరారయ్యాడని సాజిదాభాను నెల రోజుల క్రితం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి రజావుద్దీన్ ఆచూకీ తెలియడం లేదు. దోపిడీ జరిగిన సమయంలో నిందితులు నేరుగా అజ్మత్ అలీ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను బంధించి బంగారు ఆభరణాలు, నగదు ఉన్న గదిలోకి నేరుగా వెళ్లి దోచుకోవడంబట్టి చూస్తే తెలిసిన వారి సమాచారంతోనే దుండగులు ఈ ఘటనకు పాల్పడి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అజ్మత్ అలీ ప్రతిరోజు రాత్రి 12 గంటలకు బయటకు వచ్చి లైట్లు ఆర్పివేస్తారనే విషయం కేవలం కుటుంబ సభ్యులకు మాత్రమే తెలుసని బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. దొంగలు మీరట్ యాసలోనే మాట్లాడారని, రజావుద్దీన్‌పైనే తమకు అనుమానాలున్నాయని బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. బాధితుడు అజ్మత్ అలీ నుంచి ఫిర్యాదు స్వీకరించిన వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**నిందితులను త్వరగా పట్టుకుంటాం**
**- సీపీ గౌస్ ఆలం**

దోపిడి జరిగిన సంఘటనా స్థలాన్ని సీపీ గౌస్ ఆలం సందర్శించి బాధితుడు అజ్మత్ అలీ, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ దోపిడి ఘటనలో నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. అజ్మత్ అలీ కుటుంబ సభ్యులకు తెలిసిన వారే ఈ దోపిడికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని, కుటుంబ సభ్యులు కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్నామని, దుండగులు చోరీ చేసిన రెండు బైక్‌లపై ఐదుగురు బైపాస్‌రోడ్‌లో వెళుతున్నట్లు వెల్లడైందన్నారు. బాధితులు మాత్రరం ఎనిమిది మంది దుండగులు ఉన్నట్లు చెబుతున్నారని, దీనిపై విచారణ జరుపుతున్నామని సీపీ గౌస్ ఆలం తెలిపారు.

**ఆయుధాలతో చెలరేగుతున్న దోపిడి దొంగలు**

కరీంనగర్‌లో కొద్ది రోజులుగా దోపిడి దొంగలు చెలరేగుతుండడం సర్వత్రా ఆందోళనలకు గురి చేస్తోంది. మే3న పీఎంజే జ్యూవెలర్స్‌లో ఐదుగురు దుండగులు ఆయుధాలతో చొరబడి అడ్డువచ్చిన సిబ్బందిపై కాల్పులు జరిపి కోటిన్నర వరకు బంగారు ఆభరణాలు దోచుకు వెళ్లారు. ఈ ఘటన మరువకముందే మంగళవారం అర్ధరాత్రి కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో అజ్మీత్ అలీ ఇంటిలోకి ఎనిమిది మంది తుపాకులు, కత్తుల వంటి మారణాయుధాలతో చొరబడి దోపిడికి పాల్పడడంంకలకలం రేపుతున్నది.

**నామమాత్రపు గస్తీ...**

కరీంనగర్‌లో రాత్రి వేళ గస్తీ నామమాత్రంగానే ఉంటుందని ప్రజలు విమర్శిస్తున్నారు. అర్ధరాత్రి వేళ రోడ్లపైనే బర్త్ డే వేడుకలు, బైపాస్ రోడ్లపై బైక్ రేసులు విచ్చలవిడిగా నడుస్తున్నప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని నగరవాసులు ఆరోపిస్తున్నారు.

**నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు..**

దోపిడికి పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు సీపీ ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. నిందితులు పట్టుకుపోయిన ఫోన్ లొకేషన్, బైక్‌ల ఆచూకీ కోసం సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. సంఘటన స్థలంలో ఒక డమ్మీ తుపాకి, సెల్‌ఫోన్ పోలీసులకు లభ్యమైంది. ఈ రెండింటిపై వేలి ముద్రలను సేకరించిన క్లూస్ టీం పోలీసులు పాత నేరస్థుల వేలిముద్రలతో పోల్చిచూస్తున్నారు. మరో వైపు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేయగా బైపాస్‌రోడ్ వరకు వెళ్లినట్లు తెలిసింది. అజ్మత్‌అలీ అల్లుడు రజావుద్దీన్‌పై ఉత్తరప్రదేశ్‌లో హత్య కేసు, అతని కుమారుడిపై మారణాయుధాల కేసు ఉన్నాయని సీపీ గౌస్ ఆలం తెలిపారు. సంఘటనా స్థలాన్ని అడిషనల్ డీసీపీ వెంకటరమణ, టాస్క్‌ఫోర్స్ ఏసిపి వాసాల సతీష్, టౌన్ ఏసీపీ వెంకటస్వామి, రూరల్ ఏసీపీ విజయకుమార్, సిఐలు రామచందర్‌రావు, పుల్లయ్య సందర్శించారు. బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు.

# గాంధీ, గాడ్సే వారసుల.. (మొదటిపేజీ తరువాయి)

**గాంధీ కుటుంబానికి కొత్తేమీ కాదు...**

పోలీసులు జరిపిన పాశవిక దాడిలో రాహుల్‌గాంధీ రక్తం నేలపై చిందిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్తేమీ కాదని, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ తమ చివరి రక్తపుబొట్టు వరకు దేశం కోసమే జీవించారని తెలిపారు. పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. ప్రధాని పదవిని సోనియాగాంధీ త్యాగం చేశారని, ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, దేశాన్ని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్‌ఈ పరీక్షల అక్రమాలపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి డిమాండ్ చేసినా.. కేంద్ర ప్రభుత్వం స్పీకర్‌పై ఒత్తిడి తెచ్చి చర్చ జరగకుండా అడ్డుకుందని ఆరోపించారు. మోదీని గద్దె దించి.. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసుకునేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో కూడా 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందని సీఎం రేవంత్ అన్నారు. ఆ సంస్థ చేసిన పొరపాట్ల వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడ వారి పప్పులు ఉడకవని.. పేరు మార్చుకుని కేంద్రం వద్దకు వెళ్లిందని చెప్పారు. ఢిల్లీ బీజేపీ వారితో మాట్లాడుకుని ఆ సంస్థకు కేటీఆర్ కాంట్రాక్టు ఇప్పించారన్నారు. అదే సంస్థ ఇప్పుడు కేంద్రంలోని సీబీఎస్‌ఈ పేపర్ల మూల్యాంకనంలో కూడా పొరపాట్లు చేసిందని, దీంతో ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. దేశంలో ఏ పరీక్ష జరిగినా దాని వెనక ఒక కుంభకోణం ఉంటోందని ఆరోపించారు.

**నాపై ఆ రెండు పార్టీల కుట్రలు..**

బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి కొడంగల్‌లో తనను దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. బుధవారం కొడంగల్‌లో తన నివాసంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ బీఎల్‌ఏల సమావేశంలో ఎస్‌ఐఆర్‌పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను వారి తప్పులను పట్టుకుని నిలదీస్తుండడంతో ఎదురు నిలవలేక దొంగదెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర స్థాయిలో దెబ్బతీయాలంటే పునాదిగా ఉన్న కొడంగల్‌లో దెబ్బతీయాలనే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఒక పార్టీని అధికారంలో నుంచి దించడంతోపాటు మరో పార్టీని అధికారంలోకి రాకుండా ఆపినందుకు ఈ కుట్రలు చేస్తున్నారని, వీటిని కాంగ్రెస్ సైనికులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో మొత్తం 2,51,255 ఓట్లకుగాను ఇప్పటివరకు 1,96,620 ఓట్ల ప్రక్షాళన జరిగిందని, ఇంకా నమోదు చేసుకోని వారి సంఖ్య 54,635 ఓట్ల ప్రక్షాళన జరగాల్సి ఉందని సీఎం తెలిపారు. మిగిలిన 22 శాతాన్ని ఈ నెల 30లోగా పూర్తి చేసి రాష్ట్రంలో అగ్రగామిగా నిలపాలని కోరారు. గత ఎన్నికల్లో 35 వేల ఓట్ల మెజారిటీతో గెలిచామని, ఇప్పుడు మిగిలిన 54,635 ఓట్లను తొలగిస్తే గెలుపు కంటే మరో 20 వేల ఓట్లు మైనస్ అయ్యే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ఎన్నికల సంఘం పర్యవేక్షణలోని బీఎల్‌వోలు పనిచేసినా, చేయకపోయినా.. పార్టీ తరఫున పనిచేస్తున్న బీఎల్‌ఏలు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటు నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు.

**ఓటు కోల్పోతే సర్వం కోల్పోయినట్లే..**

ఓటరు జాబితాలో పేరు లేకుండాపోతే.. సర్వం కోల్పోయినట్లేనని సీఎం రేవంత్ అన్నారు. ఓటు కోల్పోతే సంక్షేమ పథకాలు కోల్పోతారనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు 90 శాతం మంది కాంగ్రెస్‌కు ఓట్లేస్తారని, వీరితో పాటు మహిళలు, కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను తొలగించే ప్రమాదం ఉందని చెప్పారు. దీనిపై బీఎల్‌ఏలు, పార్టీ ముఖ్య నాయకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొడంగల్‌లోని తన నివాసంలో ఎన్యుమరేషన్ ఫారాలను సీఎం స్వయంగా పూర్తి చేసి.. బీఎల్‌వోకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు కల్వ సుజాత, వికాదారాసింగ్, ప్రశాంత్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ విదేశీ..

(మొదటిపేజీ తరువాయి)

నివాసం ముట్టడికి దిగడం చట్టసభల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. మోదీ నాయకత్వంలో దేశం పురోగమిస్తుంటే రాహుల్ గాంధీ, కేజ్రీవాల్ ప్రేరణతో విచ్ఛిన్నకర శక్తులు దేశాన్ని విడగొట్టేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. నీట్ అంశంపై ఢిల్లీలో జరిగిన నిరసనల్లో ఆర్టికల్ 370 పునరుద్ధరణ, చైనా, పాకిస్థాన్‌కు మద్దతుగా కొందరు దేశవ్యతిరేక నినాదాలు చేయడం దిగ్భ్రాంతికరమన్నారు. కాంగ్రెస్ 'తుక్డే తుక్డే' రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం కొనసాగుతుందని, పోలీసుల అరెస్టులకు భయపడేది లేదని రాంచందర్ రావు స్పష్టం చేశారు. కాగా, నీట్‌పై పార్లమెంట్‌లో చర్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కాక్రోచ్ పార్టీతో పోటీ పడేందుకే ప్రధాని మోదీ ఇంటి ముందు ధర్నా పేరుతో కాంగ్రెస్ రాజకీయ డ్రామా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేతగా కూడా జనం అంగీకరించడం లేదని, ఆయన ప్రధాని కావడం జరగని పనని సంజయ్ స్పష్టం చేశారు. కాగా, దేశ సమగ్రతను దెబ్బ తీసేందుకు కుట్ర చేస్తున్న దేశ వ్యతిరేక, విదేశీ శక్తులకు అల్లా ఆశీస్సులతో వారి భాషలోనే సమాధానం చెబుతామని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. బీజేపీ కార్యాలయం వద్ద దాడులకు దిగిన కాంగ్రెస్ నేతలకు సహకరించిన పోలీసులు.. కాంగ్రెస్ తీరుకు నిరసనగా ధర్నాకు దిగిన బీజేపీ శ్రేణులను మాత్రం అరెస్టు చేశారని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు దుయ్యబట్టారు.

**హనుమకొండలో బీజేపీ నిరసన ఉద్రిక్తం**

హనుమకొండ, ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్‌ల్లో బీజేపీ శ్రేణులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేసి నిరసన తెలిపాయి. అయితే, హనుమకొండలో బీజేపీ శ్రేణులు చేసిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేయమని పోలీసులకు హామీ ఇచ్చి నిరసన చేపట్టిన బీజేపీ శ్రేణులు.. హనుమకొండ డీసీసీ భవన్ ఎదుట దిష్టిబొమ్మ దహనానికి యత్నించాయి. పోలీసులు అడ్డుకోగా తోపులాట జరిగింది. కానీ, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసిన బీజేపీ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, యూత్ కాంగ్రెస్ నేత తోట పవన్ పోలీస్ స్టేషన్ ఎదుటకు వచ్చి బీజేపీ నేతలకు చెప్పులు చూపించి రెచ్చగొట్టడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారగా పోలీసులు ఇరువర్గాలను అడ్డుకున్నారు.

## ఒక్కో నౌకకు.. (మొదటిపేజీ తరువాయి)

పెరిగి బ్యారెల్‌కు 95 డాలర్లకు చేరింది.

**సౌదీతో అమెరికా అణు ఒప్పందం**

వాషింగ్టన్, జూలై 22: సౌదీ అరేబియాతో అణు ఒప్పందానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆమోదం తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా పౌర అణు కార్యక్రమం కోసం సౌదీలోనే యురేనియం శుద్ధి చేయడానికి మార్గం సుగమమైంది. ఈ ఒప్పందం 30 ఏళ్ల పాటు అమలులో ఉండనుంది. దీనిపై ఇరు దేశాలు సంయుక్తంగా నిర్వహించే అధ్యయనం అనంతరం అమెరికన్ కంపెనీలు సౌదీలో అణుశుద్ధి కేంద్రాన్ని నిర్మించనున్నాయి. పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ ఒప్పందం కుదరడం గమనార్హం.

# తోడ్పాటునివ్వండి..

(మొదటిపేజీ తరువాయి)



రచన చేస్తున్నట్లు సమాచారం. దీనిపై బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రధాని కీలక చర్చలు జరిపారు. ఆగస్టు 1న భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారం భించాల్సిందిగా చంద్రబాబు ప్రధానిని ఆహ్వానించారు. ఇదే సమయంలో కీలక బిల్లుల ఆమోదంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మహిళా రిజర్వే షన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించేందుకు అవలం బించాల్సిన వ్యూహంపై దాదాపు 40 నిమిషాలు ముఖాముఖి చర్చలు జరిపా రు. విశ్వస నీయ సమాచారం ప్రకారం... "కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన, ప్రతిపక్షాల నిరసనలు త్వరలో సద్దుమణుగుతాయి. అది పెద్ద రాజకీయ సమస్య కాదు. పరిస్థితి పూర్తిగా నియంౖ తణలో ఉంది. వచ్చేవారం పార్లమెంటులో కొన్ని కీలక బిల్లులు ఆమో దం పొందుతాయి. ఆతర్వాతివారంలో కీలకమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించి...మహిళలు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తు న్న రిజర్వేషన్‌ను అమలు చేయాలని భావిస్తు న్నాం" అని మోదీ చెప్పినట్లు తెలిసింది.ఆగస్టు 1లోపే రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. రాజ్యసభలో బిల్లు ఆమోదానికి ఢోకా లేదని, లోక్‌సభలో కొంత సంఖ్యాబలంఅవసరమని ప్రధాని చెప్పినట్లు సమాచారం. ఎన్‌సీపీ, డీఎంకేతో పాటు పలుపార్టీల నేతలతో సంప్రదిస్తున్నా మంటూ... 'మీరు కూడా దీనికి తోడ్పడాలి' కోరినట్లు తెలిసింది. తొలుత చంద్రబాబు, కేంద్రమంత్రి భూపతి వర్మ, పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీపీ నేత లావు కృష్ణదేవరాయ, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మోదీని కలుసుకున్నారు. కలిశెట్టిని చంద్రబాబు పరిచయం చేయబోగా... 'ఆయనెందుకు తెలియదు, రోజూ పార్లమెంట్‌కు సైకిల్‌పై వస్తారు కదా! ఆయన క్రమశిక్షణే వేరు' అని ప్రధాని ప్రశంసించారు.

**కాంగ్రెస్ 'చలో రాజ్ భవన్' నిరసన లో పాల్గొన్న**

# యువనేత ఆంజనేయ వర్మ

**నిజాంపేట్**



నీట్ పేపర్ లికేజీ వ్యవహారం లో కేంద్ర ప్రభుత్వ వ్యవహారశైలి కి నిరసనగా, విద్యార్థులకు అండగా బుధవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన'చలో రాజ్ భవన్' నిరసన కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ కు చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు పర్వతిని ఆంజనేయ వర్మ పాల్గొని వినూత్న ప్ల కార్డులతో విద్యార్థులకు మద్దతుగా నీట్ పరీక్ష లికేజీ వ్యవహారం లో విద్యార్థుల భవిష్యత్ ను వారి ఏడాది సమయాన్నివృధా చేసిన కేంద్రప్రభుత్వ దాటవేత ధోరణికి వ్యతిరేకంగా తన నిరసనను వ్యక్తపరిచి అందరిని ఆలోచింపచేశారు.

## ఎల్ఐజీ ఇళ్ల దరఖాస్తు సమస్యల పరిష్కారం!

కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ప్రారంభించిన ఇందిరమ్మ ఎల్‌ఐజీ ఇళ్ల పథకం దరఖా స్తుల ప్రక్రియలో సమస్యలను హౌసింగ్ బోర్డు పరిష్కరించింది. మొదటి రోజైన మంగళవారం.. 'మీ-సేవ'లో సాఫ్ట్‌వేర్ సమస్యలతో పాటు మీ-సేవ నిర్వహకుల అవగాహన లోపం కారణంగా అప్లికేషన్ల స్వీకరణ, ప్రాసెసింగ్‌లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాంతో తొలిరోజు ఆశించినస్థాయిలో దరఖాస్తులను స్వీకరించలేకపోయారు. దరఖాస్తు విధానంలో ఉన్న ఇతర మరికొన్ని అంశాలతోనూ దరఖాస్తుదారుల్లో గందరగోళం తలెత్తింది. దీనిపై.. 'తొలిరోజు 115 దరఖాస్తులే' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనంతో హౌసింగ్ బోర్డు సమస్యలను పరిష్కరించేందుకు రంగంలోకి దిగింది. సాఫ్ట్‌వేర్ సమస్యలను పరిష్కరించడంతోపాటు, పలు వెసులుబాట్లు కల్పించింది. ఫలితంగా దరఖాస్తుల స్వీకరణలో వేగం పెరిగిందని మీ-సేవ నిర్వహకులు చెప్పారు.

## పదేళ్లలో 152 పరీక్షల..

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నపత్రాలు లీక్ అయ్యా యి. దీనివల్ల 7.50 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశన మైంది. ఇన్ని లీకేజీలు జరిగినా ఒక్క బాధ్యుడికి కూడా శిక్ష పడకపోవడం దారుణం. నీట్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహి స్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. విద్యా వ్యవస్థను నాశనం చేసినందుకు ప్రధాని మోదీ దేశ యువతకు క్షమాపణ చెప్పాల'ని రాహుల్ డిమాండ్ చేశారు. 'విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు సుమారు రూ.1.4 లక్షల కోట్లు అయితే, ప్రతి ఏటా నీట్ వంటి పరీక్షల కోసం విద్యార్థుల కుటుంబాలు ఏకంగా రూ.1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఇంత సొమ్ము వసూలు చేసి చివరకు 'పేపర్ లీక్ అయింది' అని చెప్పడం ఎంతవరకు సమంజసం? ఇది పక్కా ప్రణాళికతో జరుగుతున్న దోపిడీ కాదా?' అని ప్రశ్నించారు. 'ధర్మేంద్ర ప్రధాన్ అసమర్థుడు, అవినీతిపరుడు. ఈ విద్యా సంక్షోభానికి ఆయనే బాధ్యత వహించాల'ని డిమాండ్ చేశారు. 'దెబ్బలు తినడం నాకు అలవాటే. నేను నాకు తగిలిన దెబ్బల గురించి బాధపడటం లేదు. విద్యార్థులకు జరుగుతున్న అన్యాయం చూస్తుంటేనే బాధగా ఉంది. ప్రజల గళం వినిపించడం ప్రతిపక్ష నేతగా నా బాధ్యత. ఇందుకోసం ఎన్ని దెబ్బలైనా తినడానికి సిద్ధంగా ఉన్నా'నని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తుందని, రాజకీయాల కోసం కాదని స్పష్టం చేశారు.

మన సమాజం
తెలుగు డిజిటల్ దినపత్రిక
గురువారం, జులై 23, 2026

# విద్యార్థుల అండగా నిలబడితే అరెస్టు చేస్తారా

**రాహుల్, ప్రియాంక అరెస్టును తీవ్రంగా ఖండించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**విద్యార్థులకు మద్దతుగా కొడంగల్‌లో నిరసనలో పాల్గొన్న సీఎం**

**శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం ఆందోళనకరమని వ్యాఖ్య**

**అదుపులో ఉన్న విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్**




**కొడంగల్, జూలై 22 :**
జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై విద్యార్థులకు మద్దతుగా నిరసన తెలిపిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అరెస్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా కొడంగల్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ప్రశ్నపత్రం లీక్ వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కు ఉందని, దానిని గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం జరిగిందన్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలకు చోటు ఉండకూడదని, ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నాలు తగవని అన్నారు. నిరసన హక్కును పరిరక్షించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. నిరసన సందర్భంగా అదుపులోకి తీసుకున్న విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితి, ప్రస్తుతం ఎక్కడ ఉన్నారనే విషయాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని సంబంధిత అధికారులను కోరారు. విద్యార్థుల పట్ల సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడటంలో కాంగ్రెస్ ఎప్పుడూ వెనుకడుగు వేయలేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల హక్కులు, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో రాజీపడబోమని అన్నారు. కొడంగల్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రశ్నపత్రం లీక్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# హుస్నాబాద్‌లో మహా ధర్నా

**రాహుల్, ప్రియాంక అరెస్టులను ఖండించిన మంత్రి పొన్నం**

**నీట్ పేపర్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చకు డిమాండ్**

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్**

**హుస్నాబాద్, జూలై 22:**
లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకుల అరెస్టులను నిరసిస్తూ హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌక్ వద్ద రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ప్రజల గొంతును అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించి, పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారి సమస్యలకు న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడే పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని తెలిపారు. ధర్నాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై పారదర్శక విచారణ జరిపి బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.




# 7 వేల మెగావాట్ల షాక్‌నూ తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ

**వర్షాభావ సవాళ్ల మధ్యనూ నిరంతరాయ విద్యుత్ సరఫరా**

**దేశంలో తొలిసారిగా విద్యుత్ అంబులెన్స్ సేవలు ప్రారంభం**

**డిస్కంలను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపే లక్ష్యమని భట్టి**



**హనుమకొండ, జూలై 22**
ఎల్‌నినో ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించే స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరిగి, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో ఒకేసారి సుమారు 7 వేల మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ సమర్థంగా ఎదుర్కొందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాధారణంగా వర్షాకాలంలో సుమారు 11 వేల మెగావాట్లుగా ఉండే గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఈసారి 16,500 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క తెలిపారు. మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో సుమారు 2 వేల మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని చెప్పారు. అయినప్పటికీ ముందస్తు ప్రణాళికలు, విద్యుత్ శాఖ సిబ్బంది సమిష్టి కృషితో రాష్ట్ర ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించగలిగామని వెల్లడించారు. కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి భారీ ఎత్తిపోతల పథకాలకు, అలాగే వర్షాభావం కారణంగా రైతులు అధికంగా బోరు మోటార్లను వినియోగించడం వల్ల ఏర్పడిన అదనపు విద్యుత్ అవసరాలను కూడా ప్రభుత్వం సమర్థంగా నిర్వహించిందని తెలిపారు. రాష్ట్రంలో పవర్‌కట్ అనే పరిస్థితి లేదని స్పష్టం చేసిన ఆయన, ప్రకృతి వైపరీత్యాల వల్ల స్తంభాలు, విద్యుత్ లైన్లపై చెట్లు పడినప్పుడు మాత్రమే తాత్కాలిక అంతరాయాలు ఏర్పడతాయని, వాటిని పవర్‌కట్‌గా భావించవద్దని ప్రజలకు సూచించారు. ప్రజాబాట, పొలంబాట కార్యక్రమాల ద్వారా అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. విద్యుత్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో విద్యుత్ అంబులెన్స్ సేవలను ప్రారంభించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, నిచ్చెనలు, అవసరమైన పరికరాలతో పాటు నిపుణులైన సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా ఈ సేవలను రూపొందించామని చెప్పారు. ఉచిత టోల్‌ఫ్రీ సంఖ్య 1912కు ఫోన్ చేసిన వెంటనే కృత్రిమ మేధ సాంకేతికత ద్వారా ఫిర్యాదు నమోదై, సమాచారం వెంటనే విద్యుత్ అంబులెన్స్ బృందానికి చేరి అత్యవసర సేవలు అందించే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు వివరించారు. డిస్కంల ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేయడానికి అధిక వడ్డీతో తీసుకున్న పాత రుణాలను పునర్వ్యవస్థీకరించి రుణభారాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ చర్యలతో ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలను దేశంలోనే అత్యుత్తమ సంస్థలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల బిల్లుల మొత్తాన్ని ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తోందని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు అవసరమైన సుమారు రూ.14 వేల కోట్ల సబ్సిడీని కూడా ప్రభుత్వం నేరుగా విడుదల చేస్తోందని వెల్లడించారు. విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.1.20 కోట్ల బీమా సౌకర్యం కల్పించామని, సురక్షితంగా పనిచేసేందుకు అవసరమైన భద్రతా పరికరాలు, యూనిఫారాలు అందించామని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత ఆధునికంగా, ప్రజలకు మరింత చేరువగా తీర్చిదిద్దేందుకు అన్ని స్థాయిల్లో సంస్కరణలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# జూలై 20 భయం బద్దలైన రోజు..

జూలై 20-భారత ప్రజాస్వామ్య చరిత్రలో గుర్తుండిపోయే రోజు. ఎందుకని? రాజనీతిశాస్త్ర విదుషీమణి వన్యా వైదేహి భార్గవ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసిన వ్యాఖ్యలే ఆ ప్రశ్నకు సమాధానం: 'ఎంతోకాలంగా అణచివేతకు గురవుతోన్న ప్రజాస్వామిక చైతన్యం తిరిగి కొత్త మొలకలా పునరుత్థానమవడాన్ని ఈ రోజు చూశాను-- ఆ సజీవ స్ఫూర్తి నన్ను నిలువునా ఆవహించిన అనుభూతి చెందాను. అవ్యక్తానుభూతి అది'. సోమవారం (జూలై 20) మంగళవారం (జూలై 21)లోకి క్రమిస్తున్న తొలి ఘడియల్లో వైదేహి వ్యాఖ్యలను నేను చదివాను. క్రితం రోజు ఢిల్లీ వీధుల్లో కనిపించిన దృశ్యాలు మనసులో మరోసారి కదలాడుతుండగా, విన్న మాటలు జ్ఞాపకాలుగా ప్రవహిస్తుండగా ఆ కన్నంత విన్నంతలో స్ఫూర్తిదాయక నూతన వెలుగులను దర్శించాను. మనం నియంతృత్వ పోకడల్లో పోటీలు పడే పరిస్థితి నుంచి ఎన్నికల ద్వారా గెలిచి సర్వం సహాధికారం చెలాయించే స్థితిలోకి జారిపోతున్న సందర్భంలో ఉన్నామనేది నా వాదన. ప్రతిపక్షం ఈ వాస్తవాన్ని గుర్తించి ఎన్నికల రాజకీయాల నుంచి ప్రతిఘటన రాజకీయాలకు మారాలని, మారితీరాలని నేను సునిశ్చితంగా విశ్వసిస్తున్నాను. జంతర్ మంతర్ వద్ద యువ భారతీయుల నిరసన. ప్రతిఘటన రాజకీయాలకు ఒక నిర్దుష్ట నిదర్శనం. ఈ నా అభిప్రాయాన్ని ఎనిమిది కారణాలతో విశదీకరిస్తాను. ఒకటి-అంకెలు: జంతర్ మంతర్ నిరసన ర్యాలీలో ఎంతమంది పాల్గొన్నారనే విషయమై కచ్చితమైన, సబబైన అంచనా లేదు. 15 నుంచి 20 వేల మంది రావచ్చని నిర్వాహకులు భావించారు. ఆ ప్రకారం ఏర్పాట్లు చేశారు. అయితే నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వారి సంఖ్య ఆ అంచనాకు మించి చాలా చాలా రెట్లు అధికంగా ఉన్నదనేది సందేహాతీతమైన వాస్తవం. లక్ష మందికి పైగా ఆ నిరసనలో పాల్గొని ఉంటారని డ్రోన్ కెమెరాలు తీసిన ఛాయాచిత్రాలు స్పష్టంగా సూచిస్తున్నాయి. తొలుత ఒక మార్చ్‌గా అనుకున్నది తరువాత నిరసన ప్రదర్శనగా పరిణమించింది. అంతేనా? ఎక్కడెక్కడి జనాలు వెల్లువెత్తి జనసంద్రంగా మారిన నిరసన అది. పార్లమెంటుకు వెళ్లే ప్రతి వీధీ, జనపథ్‌లోని ప్రతి బాటా మధ్యాహ్నానికి నిరసనకారులతో నిండిపోయింది. సందేహం లేదు, భారతదేశ 'ఆక్యుపై' ఉద్యమ సందర్భమిది. రెండు- సహజసిద్ధమైన సమీకరణ: నిరసనకారుల సంఖ్య కంటే వారి సమీకరణ తీరు ఈ నిరసన ప్రదర్శనకు విశిష్టతను సంతరింపజేసింది. అవును, అది సహజసిద్ధమైన సమీకరణ. మన దేశంలో రాజకీయ పార్టీల ర్యాలీలకు డబ్బులు, ఇతర ప్రలోభాలతో జనాన్ని సమీకరించడం పరిపాటి. అయితే ఈ నిరసన ప్రదర్శన అలా జరగలేదు. జంతర్ మంతర్‌కు చేరిన వారందరూ తమకు తాముగా వచ్చినవారే. ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలలో విజ్ఞప్తులకు ప్రతిస్పందించి స్వచ్ఛందంగా వచ్చినవారే. ఎవరి ప్రయాణ ఏర్పాట్లు వారే చేసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి నడిచి వచ్చినవారు చాలామంది ఉన్నారు. మూడు-నిరసనకారుల్లో కొట్టొచ్చినట్టు కనిపించిన వైవిధ్యం: 'పూర్తిగా అసంగత వైవిధ్యం' అని నా స్నేహితుడు ఒకరు అభిప్రాయపడ్డారు. జంతర్ మంతర్ నిరసన ప్రదర్శనకు అరుణాచల్ ప్రదేశ్ నుంచి వచ్చిన ఒక వ్యక్తిని నేను కలుసుకున్నాను. అలాగే హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల నుంచి వచ్చిన వయోజనుల బృందం ఒకటి నాకు తటస్థించింది. స్పానిష్ భాషా సాహిత్యాల విద్యార్థి ఒకరు వీల్‌చైర్‌లో వచ్చారు. డెహ్రాడూన్ నుంచి వచ్చిన బాలికల బృందం నన్ను అబ్బురపరిచింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాలలోని అన్ని ప్రాంతాల నుంచి డజన్ల సంఖ్యలో బాల బాలికలు, యువతీ యువకులు వచ్చారు. సంపన్న కుటుంబాల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉండే ప్రైవేట్ విశ్వవిద్యాలయాల విద్యార్థినీ విద్యార్థులు ఎంతోమంది వచ్చారు. మామూలు కళాశాలలకు చెందినవారు సైతం ఎంతోమంది వచ్చారు. సరే, ప్రతిష్ఠాత్మక సివిల్ సర్వీస్‌లకు ఎంపికయ్యేందుకు ఆరాటపడే ముఖర్జీనగర్ 'ఆకాంక్షాపరులు' సైతం చాలా పెద్ద సంఖ్యలో వచ్చినట్టు నేను గమనించాను. చెప్పితీరాల్సిన విషయమేమిటంటే ఈ ఆహూతులు అందరిలోను మహిళల శాతం అత్యధికంగా ఉండడం. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నవారిలో అత్యధికులు ఇటువంటి నిరసనలలో తొలిసారి పాల్గొన్నవారే కావడం మరో అవిస్మరణీయమైన వాస్తవం. అన్నట్టు, వారి కుటుంబాలు చాలావరకు భారతీయ జనతా పార్టీ మద్దతుదారులేనని నేను కచ్చితంగా చెప్పగలను. అలాగే నిన్నటిదాకా ఈ కొత్త యువ నిరసనకారులు కూడా. ఇది కొట్టివేయలేని వాస్తవం. ప్రస్తుత దేశ పాలకులను తప్పక కలవరపరిచే నిజమిది. నాల్గవది- నిరసనకారుల ప్రేరణ: ప్రశ్నపత్రాల లీక్‌కు రగిలిపోయి మాత్రమే ఈ యువ భారతీయులు జంతర్ మంతర్ వద్ద ధర్నాకు రాలేదు. పెచ్చరిల్లుతోన్న నిరుద్యోగం, అవినీతిమయమైన అధికార వ్యవస్థలు, రాజకీయ పార్టీల కపటాలు వారిని ఈ నిరసనలో పాల్గొనేలా ప్రోద్బలించాయి. నీట్ పరీక్ష రద్దు, సీబీఎస్ఈ కుంభకోణం మూలంగా ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులు హతాశులయ్యారు. వారు మాత్రమేనా? ఆ యువత తల్లిదండ్రుల ఆవేదనను ఎలా విస్మరించగలం? మరీ ముఖ్యంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినీ విద్యార్థుల జననీ జనకులు, తోబుట్టువుల బాధను ఉపేక్షించగలమా? విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యోగాలను వెతుక్కుంటున్నవారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారు. దేశ పాలనా వ్యవస్థల్లో అవినీతి అక్రమాలకు సంభావ్య బాధితులే ఆ నిరసనకారులు. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన విధ్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్వహించకపోవడాన్ని వారు తీవ్రంగా గర్హించారు. అంతకంటే ముఖ్యంగా ప్రభుత్వాలు తమకు నాణ్యమైన విద్యనందించలేదని, ఉద్యోగాలు కల్పించడాన్ని పూర్తిగా అలక్ష్యం చేస్తున్నారని ఆగ్రహించిన యువతీ యువకుల సమూహమది. 1974లో బిహార్‌లో లోక్ నాయక్ జేపీ ఉద్యమం తరువాత విద్యా ఉద్యోగాలను జాతీయ అజెండాలో ప్రధానాంశాలుగా చేసిన ప్రప్రథమ యువజన ఉద్యమమిది. అయిదు- విశాల ప్రతిఘటనా స్ఫూర్తి: నిరసనకారులకు నిజమైన కథా నాయకుడు సోనమ్ వాంగ్‌చుక్. ఆయన్ని వారు అమితంగా గౌరవిస్తున్నారు. ఆరాధన స్థాయిలో ఆ గౌరవమున్నది. అయితే ఆ వీరారాధన పదిహేను సంవత్సరాల క్రితం అన్నా హజారే ఉద్యమంలో మాదిరిగా పెద్దపెట్టున లేదు. చిత్తశుద్ధి ఉన్న మౌన ఆరాధన ఇది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), దాని నాయకత్వాన్ని విమర్శించేందుకు సైతం ఈ యువ నిరసనకారులు వెనుకాడలేదు. ఆరు-ప్రధాన స్రవంతి మీడియాపై అసంతృప్తి: 'విధేయ (గోదీ) మీడియా, వెనక్కి వెళ్లిపో' అని నిరసనకారులు పలుమార్లు నినదించారు. ప్రధాన స్రవంతి మీడియా కథనాల పట్ల యువత అసంతృప్తికి ఇదొక నిదర్శనం. గత నెల రోజులుగా జంతర్ మంతర్ వద్ద ధర్నాను దేశ రాజధానిలోని టీవీ చానెల్స్, వివిధ పత్రికలు సరిగ్గా పట్టించుకోనే లేదు. పైగా పరిహసించాయి. అవాంఛనీయమైనవిగా చిత్రించాయి. అయితే ప్రభుత్వ మద్దతుదారుల కథనాలు పూర్తిగా వమ్మయ్యాయి. పాలకుల అంచనాలు తలకిందులయ్యాయి.



## ఆమె నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా

ప్రస్తుతం భారీ అంచనాలతో తెరకెక్కుతున్న పానిండియా సినిమాల్లో 'టాక్సిక్' తొలి వరుసలో ఉంటుంది. 'కేజీఎఫ్'ఫేం యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా కియారా తన తాజా ఇంటర్వ్యూలో 'టాక్సిక్' సెట్‌లో తన అనుభవాలను పంచుకున్నది. 'డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా. టైమ్‌కి చాలా విలువ ఇచ్చేవారామె. ఒకసారి ఫోన్ చేసి.. 'రేపు నువ్వు సెట్‌లోకి రాగానే పూర్తిగా పాత్రలోనే ఉండాలి. ఎలాంటి మర్యాదలు, పలకరింపులు వద్దు.నేరుగా క్యారెక్టర్ జోన్‌లోకి వచ్చేయాలి' అని సీరియస్‌గా చెప్పారు. నిజానికి నేను ఆ విధానానికి పూర్తి వ్యతిరేకం. సెట్‌లోకి రాగానే ముందు అందర్నీ విష్ చేయడం నాకు అలవాటు. లొకేషన్లో ఉత్సాహంగా ఉండే మనిషిని. కానీ డైరెక్టర్ మాట వినాలి కాబట్టి తను చెప్పినట్టే చేశాను' అని గుర్తు చేసుకున్నది కియారా అద్వాణీ. ఇందులో నదియా అనే పాత్రలో కియారా నటిస్తుండగా, నయనతార గంగ పాత్రలో కనిపించనున్నది. 'ఎలిజిబెత్' అనే పాత్రలో హ్యూమా ఖురేషి, 'రెబెకా'గా తారా సుతారియా, 'మెలిసా' పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించనున్నారు.

## ఎల్లమ్మగా మమితాబైజు?



'బలగం' తర్వాత దర్శకుడు 'ఎల్లమ్మ' సినిమా ప్రకటించిన నాటినుంచీ ఈ సినిమాలో నటించే తారల వ్యవహారం ఓ ప్రహసనంగా మారింది. హీరోగా ముందు చాలామంది పేర్లు అనుకున్నారు. చివరకు సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఖరారయ్యారు. ఆయనపై తాజాగా గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. ఇక 'ఎల్లమ్మ'లో హీరోయిన్ ఎవరు? ప్రస్తుతం ఫిల్మ్ వర్గాలను వెంటాడుతున్న ప్రశ్న ఇది. మొదట్లో సాయిపల్లవి అన్నా ఆ తర్వాత కీర్తి సురేశ్ పేరు వినిపించింది. ఈ వరుసలోనే చాలామంది హీరోయిన్ల పేర్లు మీడియాలో చక్కర్లు కొట్టాయి. చివరకు మలయాళ మందారం మమితాబైజు ఖరారైందంటూ ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. అయితే.. ఈ పేరు బయటకు వచ్చిన నాటినుంచీ, ప్రేమలు, డ్యూడ్ లాంటి ట్రెండీ క్యారెక్టర్లు చేసే మమితాబైజు ఈ విలేజ్ డ్రామాలో ఇమడగలదా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ధనుష్ 'కర' సినిమాలో ఆమెది విలేజ్ నేపథ్య పాత్రేననీ, తను స్వతహాగా మంచినటి కాబట్టి, ఎలాంటి పాత్రనైనా అలవోకగా చేయగలదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అధికారిక ప్రకటన వచ్చేదాకా ఇవన్నీ ఊహాగానాలే అనాలి

### ముసలిదానివి అయిపోతున్నావ్,

## పెళ్లి చేసుకోమన్న నెటిజన్..



సోషల్ మీడియాలో సెలబ్రిటీలపై ట్రోలింగ్ ఇప్పుడు సాధారణ విషయంగా మారిపోయింది. ముఖ్యంగా హీరోయిన్ల వయస్సు, పెళ్లి, వ్యక్తిగత జీవితాలపై తరచూ నెగెటివ్ కామెంట్లు వస్తూనే ఉంటాయి. తాజాగా బాలీవుడ్ నటి షమితా శెట్టి కూడా ఇలాంటి ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. అయితే ఈసారి ఆమె హుందాగా, ఘాటుగా ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల సోషల్ మీడియాలో షమితా శెట్టిపై ఓ నెటిజన్ చేసిన కామెంట్ చర్చనీయాంశమైంది. "మీ వయస్సు పెరిగిపోయింది.. ముసలితనం వచ్చేస్తోంది. ఇప్పటికైనా పెళ్లి చేసుకోవచ్చు కదా" అంటూ అతను కామెంట్ చేశాడు. ఈ కామెంట్‌ని చాలామంది సాధారణంగా పట్టించుకోకుండా వదిలేస్తారు. కానీ షమితా మాత్రం ఎంతో హుందాగా, అదే సమయంలో గట్టిగానే స్పందించారు. వయస్సుపై వచ్చిన విమర్శలకు స్పందించిన షమితా శెట్టి.. జీవితంపై తన పాజిటివ్ దృక్పథాన్ని వెల్లడించారు.అవును.. నా వయస్సు పెరుగుతోంది. దాంతో పాటు నాలో మార్పులు కూడా వస్తాయి. కాలంతో పాటు ప్రకృతిలో ప్రతిదీ మారుతుంది. శారీరక రూపురేఖలతో సహా ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు అంటూ ఆమె పేర్కొన్నారు.అలాగే తాను ప్రస్తుతం ఎంతో ఆరోగ్యంగా, ఫిట్‌గా, మానసికంగా సంతోషంగా ఉన్నానని స్పష్టం చేశారు. నా వయస్సుకు తగ్గట్లుగా నేను చాలా ఫిట్‌గా ఉన్నాను. మానసికంగా ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా జీవిస్తున్నాను. అది నాకు చాలు అంటూ షమితా చెప్పిన మాటలు ఇప్పుడు నెటిజన్ల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇక పెళ్లిపై వచ్చిన కామెంట్‌కు షమితా ఇచ్చిన కౌంటర్ మరింత వైరల్ అవుతోంది.పెళ్లి చేసుకుని మీరేం సాధించారు? అంతగా పెళ్లై సెటిల్ అయ్యామని అనుకునే మీరు.. నాలాంటి సింగిల్ వ్యక్తులను సోషల్ మీడియాలో ఎందుకు ఫాలో అవుతున్నారు? మా జీవితాలపై మీకెందుకు అంత ఆసక్తి? అంటూ ట్రోలర్‌ను నేరుగా ప్రశ్నించారు.ఈ సమాధానంతో సోషల్ మీడియాలో మహిళల వ్యక్తిగత జీవితాలపై అనవసర కామెంట్లు చేసే వారిపై ఆమె గట్టిగా స్పందించినట్లైంది.షమితా శెట్టి కామెంట్స్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన వస్తోంది. ముఖ్యంగా మహిళా అభిమానులు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.ఒక మహిళ పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది ఆమె వ్యక్తిగత నిర్ణయం, వయస్సు పెరిగిందని ట్రోల్ చేయడం సరైంది కాదు, షమితా చాలా మెచ్యూర్‌గా సమాధానం ఇచ్చారు అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## ఈ అభిమానం ఇలాగే ఉండాలి

శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్.ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి' అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.

